ఈనాడు
అల్లూరి సీతారామరాజు
ఆదివారం 29 సెప్టెంబరు 2024

తాడే ఆధారం.. తప్పని జీవనపోరాటం


సీతపల్లి వాగు దాటుతున్న గుంపెనపల్లి గిరిజనుడు

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీతపల్లి వాగులో ప్రవాహ ఉద్ధృతి తగ్గడం లేదు. దీంతో సీతపల్లి వాగు ఆవల వైపున ఉన్న గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాల గిరిజనులు సుమారు రెండు నెలలుగా వాగు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ పనులకు సైతం బయట ప్రాంతాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి. అత్యవసర పనులపై వెళ్లాలంటే సాహసం చేసి తాళ్ల సాయంతో వాగును దాటుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్న వారిని వి.రామన్నపాలెం వద్ద వాగుపై ఏర్పాటుచేసిన తాళ్లవంతెన పై నుంచి బయట ప్రాంతాలకు తీసుకువెళ్తున్నామన్నారు. అయితే లక్ష్మీపురం నుంచి వి.రామన్నపాలెం వరకు రహదారి అధ్వానంగా ఉండటంతో వర్షాకాలం అంతా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. దొనలంక- గంగవరం గ్రామాల మధ్య ఎర్రగెడ్డ వాగు పొంగడంతో గంగవరం, చొప్పకొండ పరిసర ప్రాంతాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఒక్కోచోట ఒక్కోలా..



మన్యంలో చాలా రోడ్లను జాతీయ రహదారులుగా మార్చుతున్నారు. 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం విజయనగరం నుంచి అనంతగిరి మండలం వెంకయ్యపాలెం వరకు పూర్తయింది. కిలోమీటర్లు తెలుపుతూ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అనంతగిరి - శృంగవరపుకోట మండలాల సరిహద్దు గ్రామమైన బొడ్డవర వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు వాహనదారులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. బొడ్డవర సమీపంలో రహదారి పక్కన ఉన్న రాయి వద్ద పాడేరుకు 88 కిలోమీటర్లు అని రాసి ఉండగా.. దానికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన బోర్డులో మాత్రం 98 కిలోమీటర్లు అని ఉంది. దీన్ని సరిచేయాలని ప్రయాణికులు, వాహనాదారులు కోరుతున్నారు. – అనంతగిరి, న్యూస్‌టుడే

సరిహద్దు రహదారి.. వానొస్తే జారి..



అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లోని గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారి చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారుతోంది. వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతగిరి మండలం గరుగుబిల్లి సమీపంలోని రోడ్డు వాన కురిస్తే చాలు చిత్తడిమయమవుతోంది. ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా వీలుపడటం లేదు. అధికారులు స్పందించి ఈ మార్గాన్ని మెరుగుపర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

తపాలా పథకం.. ప్రగతి పథం!

గిరి గ్రామాల్లో సేవల విస్తరణ



ముంచంగిపుట్టు, అరకులోయ – న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో ఒకప్పుడు ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలాశాఖ.. ప్రస్తుతం సేవలను విస్తరించింది. పేదలను పొదుపు మార్గంలో నడిపేందుకు పల్లెలకు పథకాలు విస్తరించారు. ప్రతి కుటుంబం పోస్టాఫీసులో పొదుపు ఖాతా తెరిచేలా ప్రజల్లో అవగాహన పెంచారు. తపాలాశాఖ అనకాపల్లి డివిజన్‌లోని అరకులోయ సబ్ డివిజన్‌లో ఒకప్పుడు 1100 పొదుపు ఖాతాలే ఉండేవి. నేడు వాటిని 13 వేలకు పెంచారు. అరకులోయ, అరకు ఆర్ఎస్, పెదబయలు ఉప కార్యాలయాల పరిధిలో ఉన్న 58 బ్రాంచి పోస్టాఫీసులను 74కు పెంచారు. అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని గిరిజన గ్రామాల్లో సుకన్య సమృద్ధి యోజన, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, ఆర్‌డీ, ఎంఐఎస్, పీఎస్‌బీ, గ్రామీణ తపాలా జీవిత బీమా, ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు, ప్రమాద బీమా తదితర పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. తక్కువ సమయంలో ఎక్కువ మందితో ఖాతాలు తెరిచి వారికి పొదుపు మార్గం చూపించారు.


సుకన్య సమృద్ధి యోజన ఖాతా పుస్తకాలతో..

ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండల కేంద్రాల్లో ఉప తపాలా కార్యాలయాల ఏర్పాటుకు తపాలాశాఖ చర్యలు చేపట్టింది. డుంబ్రిగుడ మండలంలోని అరకు రైల్వే స్టేషన్ ఉన్న ఎండపల్లివలసలోని ఉపతపాలా కార్యాలయాన్ని డుంబ్రిగుడకు మార్చేందుకు, ముంచంగిపుట్టులో నూతనంగా ఉపతపాలా కార్యాలయం ఏర్పాటుకు తపాలాశాఖ ఆమోదం తెలిపింది. దీనికి వసతి కల్పించాలని పాడేరు ఐటీడీఏ పీవోకు ప్రతిపాదనలు పంపించామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

జీవిత బీమాకు ఆదరణ పెంపు


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తూ..

తపాలా జీవిత బీమా, గ్రామీణా తపాలా జీవిత బీమా, ఐపీపీబీ జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో ప్రచారం కల్పించారు. ఫలితంగా గిరిజన ప్రాంతంలో ఆదరణ పెరిగింది. అరకు సబ్ డివిజన్‌లో పీయల్ఐ ప్రీమియం రూ.94 లక్షలు, ఆర్‌పీయల్ఐ ప్రీమియం రూ.61 లక్షలు చెల్లించి ఖాతాదారులు బీమా పొందారు. మరో 7 వేల మంది ఐపీపీబీ ఖాతాదారులుగా చేరి.. రూ.6.16 లక్షలు ప్రీమియం చెల్లించి జనరల్ ఇన్సూరెన్సు పొందారని ఉపేంద్ర తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమావేశాల్లో వన్‌జన్‌ధన్ కార్యక్రమాలను నిర్వహించి పొదుపు ఖాతాలు తెరిచి ఏపీ సర్కిల్‌లో గుర్తింపు సాధించారు.

అరకులోయలో పాస్‌పోర్టు కార్యాలయం!

అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలకు పాస్‌పోర్టు సేవలు చేరువ చేసేందుకు తపాలాశాఖ కసరత్తు చేస్తోంది. అరకులోయ కేంద్రంగా పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అక్టోబరు 5న అరకులోయ సబ్ డివిజన్ కార్యాలయంలో పాస్‌పోర్టు కార్యాలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధికారి అవార్డు అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

దక్కిన గుర్తింపు

అరకు సబ్ డివిజన్‌ను ప్రగతిపథంలో ఉంచిన ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కింది. ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ అవార్డు అందించి సత్కరించారు. ఈయన్ను తపాలా ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవకులు అభినందించారు

పాడేరు, అనకాపల్లి, న్యూస్‌టుడే

కదులుతుంటే మీరు.. ఆగనులే నేను!

నేడు ప్రపంచ గుండె దినోత్సవం

వ్యాయామంతోనే కలకాలం పదిలం



అనకాపల్లికి చెందిన 35 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి రోజూ ఉదయం వెళ్లి రాత్రి వస్తాడు. ఉరుకూ పరుగు జీవితం. ఇటీవల గుండెలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. వ్యాయామం చేస్తూ మందులు వాడమని వైద్యులు సలహా ఇచ్చారు.

- ఈ నెల 21న పాడేరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై శ్యాం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యసేవలు అందించినా ఫలితం లేకపోయింది.

- మాడుగులకు చెందిన ఓ వ్యక్తికి గుండె నొప్పి రావడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ అందుబాటులో ఉంచిన ఇంజక్షన్‌ను ఇవ్వడంతో ప్రాణాపాయం తప్పింది.



చిన్నారుల్లోనూ..: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు వారికి అనకాపల్లి, నర్సీపట్నంలోని బాలల సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ)లో చికిత్స అందిస్తున్నారు. రంధ్రాలు పడిన వారిలో వయస్సు పెరిగే కొద్ది మూసుకుపోయే అవకాశం ఉందని, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. గుండెపోటుకు గురైన వారికి ప్రాణాపాయం నుంచి తప్పించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంజక్షన్లు ఇస్తున్నారు. ప్రైవేటుగా వేల రూపాయల ధర ఉండే ఈ ఇంజక్షన్లను ఇటీవల కాలంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, కె.కోటపాడు, మాడుగుల, కోటవురట్ల, చోడవరం, నక్కపల్లి, ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచారు. గుండె జబ్బుకు గురైన వారికి ఈసీజీ తీసి గుండె ముందు భాగం రక్తప్రసరణలో రక్తం గడ్డకడితే ఇంజక్షన్ ఇస్తారు.



జిల్లాలో గుండె వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వయస్సులో సంబంధం లేకుండా హృద్రోగానికి గురికావడం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. యువతీ యువకులు సైతం ఈ జబ్బుల బారిన పడుతున్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో గుండె సంబంధిత వ్యాధిగ్రస్థుల పెరుగుతున్నారని వైద్యులు చెబుతున్నారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 500 నుంచి 600 మంది రోగులు వస్తుంటే వీరిలో 30 నుంచి 40 మంది గుండె సంబంధిత సమస్యలతో వస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ లేకపోవడంతో జనరల్ ఫిజీషియన్ రోగులను తనిఖీ చేసి మందులు అందిస్తున్నారు. అత్యవసర వైద్యం అవసరమైతే కేజీహెచ్‌కు పంపుతున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో కిమ్స్ ఐకాన్ ప్రైవేటు ఆసుపత్రి నుంచి కార్డియాలజిస్ట్ సిబ్బంది ప్రతి గురువారం గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా వైద్యం అవసరమైన వారికి 2డీ ఈకో పరీక్ష చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తం...

అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 18 ఏళ్ల లోపు వరకు గుండెజబ్బులతో పాటు ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తాం. అనకాపల్లి కేంద్రంలోకి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు 25 మంది చిన్నారులకు గుండె రంధ్రం పడినట్లు గుర్తించి చికిత్స అందించాం. నలుగురికి శస్త్రచికిత్సలు చేశాం.
– డాక్టర్ జి.క్రాంతి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, డీఈఐసీ



జీవన శైలి, ఆహారపు అలవాట్లే కీలకం...

మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లే గుండె జబ్బులకు ప్రధాన కారణం. జిల్లాలో ఎనిమిది సీహెచ్‌సీల్లో ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాం. జిల్లాలో ఇప్పటికి 92 మందికి వీటిని చేశాం. జిల్లా ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం నుంచి ప్రైవేటు ఆసుపత్రి సహకారంతో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నాం. –డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్



బస్సులు తిప్పండి మహాప్రభో!


రిటైనింగ్ వాల్ పరిశీలిస్తున్న ఈఈ బాలసుందరబాబు

సీలేరు, న్యూస్‌టుడే: గత 20 రోజులుగా ఆర్టీసీ సర్వీసులు రావడం లేదని, అధికారులు స్పందించి ఈ సేవలను పునరుద్ధరించాలని సీలేరు ప్రాంతీయులు కోరుతున్నారు. ఈనెల 8న కురిసిన కుండపోత వర్షానికి గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వరకూ రహదారి అస్తవ్యస్తంగా మారింది. మూడు వంతెనలు, అయిదు రిటైనింగ్ వాల్‌లు, ఒక కల్వర్టు దెబ్బతిన్నాయి. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో రహదారులు, భవనాలశాఖ అధికారులు ఈనెల 9 నుంచి రేయింబవళ్లు శ్రమించి చిన్న వాహనాలు వెళ్లేలా రోడ్డును సిద్ధం చేశారు. క్రమంగా వంతెనలు, రిటైనింగ్ వాల్‌లు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టారు. నాలుగు రోజులు క్రితం రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సు సర్వీసులను పునరుద్ధరించలేదు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు తడిసిమోపెడవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులపాటు పాడేరు డిపోకు చెందిన బస్సు పంపించినప్పటికీ అది బురదలో కూరుకుపోవడంతో ఆ సర్వీసును నిలిపివేశారు. ఇప్పటికైనా విశాఖ, నర్సీపట్నం, పాడేరు, డిపోల అధికారులు స్పందించి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

భోజనశాల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఈనాడు కథనానికి స్పందన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఆరుబయటే భోజనాలు చేస్తుండటంపై ఈనెల 25న 'ఈనాడు'లో 'చెట్టు కిందే భోజనం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. భోజనశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని పీవో ఆదేశించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు తెలిపారు.

మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తికి అంతరాయం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రంలో శనివారం విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ప్రాజెక్టులోని స్విచ్‌యార్డ్‌లో శనివారం ఉదయం 11 గంటల సమయంలో విశాఖ ఫీడర్-2కు చెందిన సీవీటీ పేలిపోయింది. ఫీడర్‌లో హెచ్చుతగ్గుల వల్ల ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో మూడు, ఆరు నంబర్ల జనరేటర్లలో ఉత్పత్తి నిలిచిపోయింది. సిబ్బంది, ఇంజినీర్లు పేలిపోయిన సీవీటీని పరిశీలించారు. మరమ్మతుల అనంతరం దశలవారీగా మూడు, ఆరో నంబరు జనరేటర్లను వినియోగంలోకి తీసుకొచ్చి 40 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని పునరుద్ధరించినట్లు ప్రాజెక్టు వర్గాలు తెలిపాయి.

తెదేపాలోకి వైకాపా ఉప ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు


తెదేపాలో చేరిన వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలంలో వైకాపాకు చెందిన ఉప ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తెదేపాలో చేరారు. వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనందరావు, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి నాగమణి(జీకే వీధి), జోరంగి సరస్వతి(వంచుల), మాడి రామన్న(దారకొండ), కిల్లో ఉల్లాష్(దుప్పులవాడ) వైకాపా మద్దతుతో గెలిచారు. వీరు గత మూడు నెలలుగా వైకాపా కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి సమక్షంలో అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారికి తెదేపాలో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై వైకాపా నుంచి తెదేపాలో చేరామని వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా నాగరాజు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలుపర్తి గోవిందరావు, అరకు పార్లమెంట్ మహిళా కార్యదర్శి గబ్బాడ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.9.35 లక్షల గంజాయి స్వాధీనం

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం గ్రామ శివార్లలో గంజాయితో సహా నలుగురిని అరెస్టు చేసినట్లు అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, గంగవరం ఎస్సై డి.భూషణం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తుగా అందిన సమాచారం మేరకు గంగవరం శివార్లలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన పూల వెంకటమ్మ, మల్లేల రాజమ్మ, నాగభూషణం, ఆవుల రవి అనే నలుగురు వ్యాన్‌లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి నుంచి సుమారు రూ. 9.35 లక్షల విలువ చేసే 187 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక వ్యాన్, రూ.1.73 లక్షల నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. వీరు గంగవరం మండలం జడేరు నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నారన్నారు. తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం పంచనామా నిర్వహించి, నిందితులను రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ కోర్టులో హాజరు పరిచామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహమూర్తి, ఎస్సై డి.భూషణం తెలిపారు.


గంగవరం శివారులో పట్టుబడిన నిందితులతో ఎస్సై, తహసీల్దార్

కాఫీ దిగుబడుల పెంపునకు చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ, మిరియాల దిగుబడులను పెంచడానికి చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు తెలిపారు. శనివారం మోదపల్లి గ్రామ సమీపంలోని కాఫీ తోటలను ఆయన పరిశీలించారు. రైతు కొర్ర వెంకటరావుతో మాట్లాడి ఏడాదికి వస్తున్న ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో సాగు చేస్తున్న అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి దక్కిందని చెప్పారు. బేబీ పల్పర్లు, టార్పాలిన్లు మంజూరు చేయాలని రైతులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం కంద మామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సబ్బులు, మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. తర్వాత పాడేరు వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని సందర్శించి అడ్డాకులతో తయారు చేసిన విస్తర్లు పరిశీలించారు. ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, ఏపీఓ ప్రభాకరరావు, పీహెచ్ఓ ఎన్ అశోక్, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఏఈ దుర్గాప్రసాద్, కాఫీ బోర్డు డీడీ రమేష్, ఇన్‌ఛార్జి డీడీ రజని, కాఫీ ఏఈఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మోదపల్లిలో కాఫీ రైతులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబు, చిత్రంలో ఐటీడీఏ పీఓ అభిషేక్ తదితరులు

మ్యూజియం పనులు వేగవంతం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు ఆదేశించారు. శనివారం తాజంగి స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సహాయ ప్రాజెక్ట్ అధికారి ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ చాణక్య, ఏఈ యాదకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

జిల్లాకు గనులు, భూగర్భశాఖ అధికారి లేనట్లేనా?

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా గనులు, భూగర్భ(మైనింగ్స్) శాఖ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో గనులు, భూగర్భశాఖ అధికారిగా గతంలో పనిచేసిన ఎస్.ఎన్ రాజునే మళ్లీ నియమించారు. జిల్లాలో పని చేయడానికి ఇష్టం లేక ఆయన విశాఖ జిల్లా విజిలెన్స్ అధికారిగా డిప్యూటేషన్‌పై అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా జరిగిన సాధారణ బదిలీల్లో మళ్లీ ఆయన్నే నియమించడంతో బాధ్యతలు స్వీకరించకుండానే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలో గనులు, భూగర్భ(మైనింగ్స్) శాఖ అధికారి పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం ఏర్పాట్లలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్న వాహనాలను సబ్ కలెక్టర్ ఇటీవల సీజ్ చేశారు. జిల్లా మైనింగ్ అధికారిని సంప్రదించి పరిష్కారం కోసం వారం రోజులుగా ప్రైవేటు వాహనదారులు తిరుగుతున్నా ఉపయోగం లేదు.



పాడేరులోని కార్యాలయం

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



చిన్నయ్యపాలెంలో యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: క్రీడలు దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జడ్డంగి ఎస్సై చిన్నబాబు అన్నారు. చిన్నయ్యపాలెం గ్రామాన్ని శనివారం ఎస్సై సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

విశ్వ విపణిలో వనితలు రాణించేలా..

- ఓఎన్‌డీసీ యాప్‌లో జిల్లా మహిళల ఉత్పత్తులు
- ప్రముఖ సంస్థలకు దీటుగా నిలిచేలా కార్యాచరణ

నర్సీపట్నం/ అర్బన్, న్యూస్‌టుడే



ఆధునిక సమాజంలో వచ్చిన ప్రతి మార్పును అవకాశంగా మలుచుకుని విశ్వ విపణిలో జిల్లా పొదుపు సంఘాల మహిళలు రాణించేలా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో తొలి అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఓపెన్ నెట్‌వర్క్ ఫ్రం డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) యాప్ ద్వారా జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయించుకునేందుకు మహిళలు ముందడుగు చేస్తున్నారు.



పొదుపు సంఘాల ప్రతినిధులకు ఓఎన్‌డీసీపై వివరిస్తున్న మెప్మా పీడీ సరోజిని

శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించి...
పొదుపు సంఘాల్లోని మహిళల పిల్లలు వివిధ నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగాల్లో స్థిరపడేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాలిటెక్నిక్ చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నవారు ఎంతమంది ఉన్నారనేది గుర్తించేందుకు జిల్లాలో ఇటీవల సర్వే నిర్వహించగా 27,172మంది నమోదయ్యారు. వీరందరికీ కేంద్రం సహకారంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా పథ సంచాలకులు సరోజని తెలిపారు.

ఉత్పత్తులను ఆహ్వానిస్తున్నాం... తయారుచేసిన ఉత్పత్తులు ఓఎన్‌డీసీ యాప్ ద్వారా అమ్ముకోవడానికి మహిళలను ఆహ్వానిస్తున్నాం. ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేకుండా గ్లోబల్ మార్కెట్‌లో అమ్ముకునేలా వెన్నంటి నిలుస్తాం. మహిళలకు ప్యాకింగ్ పనిలో శిక్షణ, అవసరమైన వారికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తాం. ప్రస్తుతం కొంతమంది మహిళలు విదేశీ యాప్‌ల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. ఆ యాప్‌ల యాజమాన్యాల నుంచి ఇరవై రోజుల వరకు నగదు జమ కావడం లేదు. కేంద్రం రూపొందించిన యాప్ ద్వారా విక్రయించుకుంటే నాలుగైదు రోజుల్లోనే నగదు జమ అవుతుంది.



– సీహెచ్.సందీప్, జీవనోపాధుల విభాగం ఇన్‌ఛార్జి, మెప్మా

నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాల్లో 2,598 పొదుపు సంఘాల్లో 27,254 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో అనేకమంది కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వివిధ రకాల వస్తువులను తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం పొదుపు సంఘాల మహిళలు మెప్మా బజార్లలో, మేళాల్లో లేదా సొంతంగా విక్రయించుకుంటున్నారు. ఇప్పుడు ఓఎన్‌డీసీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అమ్ముకునే అవకాశం కల్పించారు. అధికారులు కార్యాచరణకు దిగగానే జిల్లాలో 48 మంది మహిళలు తాము తయారుచేసిన ఉత్పత్తుల వివరాలు ఓఎన్‌డీసీలో ఉంచేందుకు ముందుకొచ్చారు. వివిధ రకాల ఏటికొప్పాక బొమ్మలు, జూట్, వస్త్రంతో తయారు చేసిన అందమైన చేతి సంచులు, నాణ్యమైన గిల్ట్ నగలు వంటివి ప్రస్తుతం విక్రయానికి ఉంచారు. వీరు యాప్‌లో వివరాలు పెట్టగానే రూ. 56 వేల విలువైన వస్తువులు అమ్ముడుపోయాయి. ప్రముఖ ఈ-కామర్స్ సైట్లలో ఉంచితే గరిష్ఠంగా 35 శాతం వరకు కమిషన్‌గా చెల్లించాల్సి వస్తోంది. ఓఎన్‌డీసీ యాప్‌లో ఉంచేవాటికి మాత్రం కేవలం మూడు నుంచి పదిశాతం మాత్రమే కమిషన్‌గా తీసుకుంటారు. తద్వారా వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు లభ్యమవుతాయి. ప్రస్తుతానికి జీవీఎంసీ సెల్లార్ పాయింట్‌ను గోదాముగా వినియోగించుకుంటున్నారు. యాప్‌లో ఆర్డర్ రాగానే ఇక్కడ నుంచే ప్యాకింగ్ పనులు పూర్తి చేసి కొనుగోలుదారులకు పంపిస్తారు.



విశాఖపట్నం నగరపాలక సంస్థలో సెల్లార్ పాయింట్‌లో ఏటికొప్పాక బొమ్మలు

రహదారి నిర్మించరూ..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: అన్నవరం వంతెన, పెద్దమట్టపల్లి-కుందులూరు మధ్య రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని తెల్లవారిగూడెం, అన్నవరంలలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశాల్లో వారు మాట్లాడారు. రహదారులన్నీ గుంతలని, నాలుగేళ్ల క్రితం అన్నవరం వాగుపైన వంతెన కొట్టుకుపోతే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, కొత్త ప్రభుత్వమైన వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ముందుగా సీతారాం ఏచూరికి నివాళులు అర్పించారు. అన్ని గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. సంతోష్, బొజ్జి, సత్తిబాబు, సుందరయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో తనిఖీలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పినకోట పంచాయతీ పరిధిలోని జీనబాబు సబ్ సెంటర్‌ను జిల్లా ప్రోగ్రాం అధికారి డి.సతీష్‌కుమార్, సిబ్బంది శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్ రికార్డులు పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్యారోగ్యశాఖ యాప్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. భూలోకమ్మ, ఇన్‌ఛార్జి గణాంక అధికారి కైలాష్‌రావు, ఎంపీహెచ్‌వో గంగరాజు, పర్యవేక్షకురాలు సావిత్రి, ఎంఎల్‌హెచ్‌వో పుష్ప, జైరానీ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి



గిరిజనులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదితరులు

సీలేరు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావిత గుమ్మిరేవుల, ధారకొండ పంచాయతీల్లో ఎంపీ తనుజారాణి, ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర శనివారం పర్యటించారు. మాదిమళ్లు, కమ్మరితోట గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ.. తుపాను కారణంగా నష్టపోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం అందివ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలను బాగుచేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీ తనుజారాణి మాట్లాడుతూ. . కూలిపోయిన ఇళ్ల స్థానంలో కొత్తవి నిర్మించి ఇవ్వాలన్నారు. లవ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇళ్లు కోల్పోయిన 35 కుటుంబాలకు తాత్కాలికంగా నివాసం ఉండటానికి టెంట్లు అందజేశారు. 75 కుటుంబాలకు నిత్యావసర సరకులు వైకాపా ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. లవ్ మినిస్ట్రీస్ అధినేత ఏసుపాదం, వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. భాగ్యలక్ష్మి, ఎంపీపీలు కుమారి, అనుషాదేవి, జడ్పీటీసీ సభ్యులు శివరత్నం, పోతురాజు బాలయ్య, సర్పంచులు కమలమ్మ, నడిగొట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధి నిర్వహణ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నేతల ఒత్తిళ్లకు తలవంచక, అటవీ సంరక్షణలో రేంజర్ మోహినీ విజయలక్ష్మి అంకితభావంతో పనిచేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్యాల రామారావు, తెదేపా యువనేత బొర్రా నరేశ్ పేర్కొన్నారు. మండలంలోని అటవిక్షేత్ర కార్యాలయంలోబదిలీపై వెళ్తున్న రేంజర్ విజయలక్ష్మిని తెదేపా ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సిద్దు, ఆది, శేఖర్, శివ, సత్యనారాయణ, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈవో కేవీ సత్యనారాయణ దొర అన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఎంఈవో-2 టి.సూరయ్యరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దినకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: పెద్దగెడ్డ వంగసారలోని కాశీ విశ్వనాథ క్షేత్రంలో శనివారం భక్తులు, గ్రామస్థులు.. పలు రకాల పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఆలయ నిర్వాహకులు కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.

అరకులోయ పట్టణం: స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా అరకులోయ మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేష్, పలువురు ఎంపీటీసీ సభ్యులతో కలసి మొక్కలు నాటారు. అక్టోబరు రెండో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ వెంకటేష్ తెలిపారు. ఉప ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్ పాల్గొన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు నీటి ట్యాంకును శుభ్రం చేశారు. పీఓలు విజయలక్ష్మి, నాగబాబు, అనితకుమారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపాక సమీపాన బుట్టాయిగూడెంలో శనివారం నందిగామ గ్రామానికి చెందిన సూదిపాక సాయి (32) ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి కింద పడటంతో అతని తలకు తీవ్ర గాయమైంది. నెల్లిపాక పీహెచ్‌సీలో ఉన్న 108 సిబ్బంది లక్ష్మణ్‌సింగ్ రాథోడ్, మహేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని నెల్లిపాక పిహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించరూ..

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో పనిచేస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు, ప్రధాన కార్యదర్శి పి.ప్రకాశ్‌కుమారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం రంపచోడవరం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా కానుకగా ఐఆర్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతామన్నారు. ఏజెన్సీలో పనిచేస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ యూనియన్ నాయకులు కుసుమకుమారి, రాఘవ, అమ్మాజి, గౌతమి, ఈశ్వరి, పోతురాజు, రామలక్ష్మి, సత్యవతి, అరుణలత, నాగలక్ష్మి, చిన్నసీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రాజు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కుమారి

వినిపిస్తోందా?

ప్రపంచ చెముడు నివారణ దినం నేడు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

“ అనకాపల్లికి చెందిన యువకుడు చెవికి సంబంధిత సమస్యతో ఆసుపత్రికి వచ్చాడు. పరీక్షించగా చెవిలో నరాలు దెబ్బతిన్నాయి. వైద్యుడు అడిగితే డీజే సౌండ్‌లో నృత్యం చేశానని చెప్పాడు. పరీక్ష చేసి వైద్యం అందించారు. అదృష్టవశాత్తు మందులతో నయమైంది.

“ ఎలమంచిలికి చెందిన ఎనిమిదేళ్ల బాలికకు సరిగా వినిపించడం లేదని అనకాపల్లిలో బాలల సత్వర చికిత్స కేంద్రానికి వచ్చింది. స్క్రీనింగ్ పరీక్ష చేసి చెవిటి మిషన్ పడుతుందని చెప్పి ఉచితంగా మిషన్ అందించారు.

శబ్ద కాలుష్యంతో వినికిడి సమస్యలు అధిక మవుతున్నాయి. అధిక శబ్దంతో చెవుడు బారిన పడుతున్న వారు పెరుగుతున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి వచ్చే ఈఎన్‌టీ రోగుల్లో చెవికి సంబంధిత సమస్యలతో వచ్చే వారు రోజుకు 10 నుంచి 15 మంది ఉంటున్నారు. వీరిలో వినికిడి సమస్య ఉన్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. రోడ్లపై భారీగా వాహనాలు పెరగడం, అధిక శబ్దంతో హారన్లు మోగడం, డీజే సౌండ్స్, క్వారీల పేలుళ్లతో వ్యాధి గ్రస్థులు పెరుగుతున్నారు.

✦ ఇటీవల అనకాపల్లిలోని బాలల సత్వర చికిత్స కేంద్రంలో చెవికి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్ష చేశారు. జిల్లా వ్యాప్తంగా 62 మంది చిన్నారులు పరీక్షా కేంద్రానికి వచ్చారు. వీరిలో 16 మందికి వినికిడి పరికరాలు అవసరం అవుతాయని గుర్తించి ఉచితంగా అందించారు.

✦ చెవి నుంచి చీము కారడం, నరాల బలహీనతతో చెవుడు వస్తుందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లోనూ ఈ లక్షణాలు ఉన్న వారికి సంఖ్య పెరగడం ఆందోళన కలగిస్తోంది. ఒకప్పుడు వృద్ధులకు వినికిడి సమస్య ఉండేది. ఇప్పుడు వయస్సు సంబంధం లేకుండా ఈ వ్యాధి బారిన పడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోంది.

✦ దాదాపు చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్‌ఫోన్లు వాడకం పెరిగిపోయింది. కొందరు ఇయర్‌ఫోన్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. చెవికి సంబంధిత సమస్యలు వచ్చిన వెంటనే ఆసుపత్రిలో చూపించుకోవాలని సూచిస్తున్నారు. 80 డిసెబుల్‌కు మించి శబ్దం ఆలకిస్తే చెవిలో కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



అనకాపల్లిలో వినికిడి పరీక్ష చేస్తున్న వైద్యులు

అప్రమత్తంగా ఉండాలి



చెవిలో చాలా సున్నితమైనవి ఉంటాయి. అధిక శబ్దం వింటే ఇవి దెబ్బతినే ప్రమాదం ఉంది. డీజే సౌండ్స్ అధికంగా పెడుతున్నారు. దీనివల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చెవికి సంబంధిత సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. శబ్దాలు ఎక్కువగా ఉన్న చోట చెవికి దూది పెట్టుకోవడం వంటి రక్షణ చర్యలు తీసుకోవాలి. చెవి నుంచి నారి కారినా పోటు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చూపించాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం పరికరాలను సమకూర్చారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. – **డాక్టర్ ఫరుద్దీన్, ఈఎన్‌టీ వైద్యులు, జిల్లా ఆసుపత్రి**

ఉచితంగా పరికరాలు



చెవుడు సమస్యతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ పరీక్ష చేసి ఉచితంగా పరికరాలను అందించేలా చొరవ చూపుతున్నాం. వయస్సులో సంబంధం లేకుండా పరీక్ష చేసుకోవచ్చు. దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడితో పరీక్ష అనంతరం చెవికి సంబంధించి వైద్యం, శస్త్రచికిత్సలను ఉచితంగా చేస్తున్నాం. సకాలంలో వైద్యం పొందితే చెవుడు బారిన పడకుండా ఉండొచ్చు. – **డాక్టర్ ప్రశాంతి, ఎన్‌సీడీ పీవో, అనకాపల్లి**

కన్నాయిగూడెంలో రక్తదాన శిబిరం

ఎటపాక, న్యూస్‌టుడే: కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకటరామిరెడ్డి వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎటపాక: వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. ఎటపాకలో కుమార్ అధ్యక్షతన జరిగిన వాలంటీర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. కొండబాబు, కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)


	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ


మంగంపాడు సంతలో గిరిజనుల ర్యాలీ

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగంపాడు సంతలో అల్లూరి ఆదివాసీ యువజన, గిరిజన అభ్యుదయ సంఘాల గిరిజనులు శనివారం మావోయిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మానవహారం, శాంతి ర్యాలీ నిర్వహించారు. గిరిజనులు ఉపయోగపడని, అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ నెపంతో చంపి, అభివృద్ధికి దూరంగా ఐతకమనే వారోత్సవాలు మాకొద్దంటూ నినదించారు.

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రదేశాల్లో గిరిజన అభ్యుదయ, అల్లూరి ఆదివాసీ యువజన సంఘాల పేరుతో శుక్రవారం రాత్రి మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలిశాయి. నందిగామ, మురుమూరు, నెల్లిపాక, బాసవారం, లక్ష్మీపురం, బండిరేవు, మాధవరావుపేట గ్రామాల్లోని ప్రధానకూడలి, బస్‌షెల్టర్లలో, జాతీయ రహదారిలో ఉన్న సూచిక బోర్డుల పైనా, భారీ వృక్షాలకు, వంతెనలకు వీటిని అతికించారు. 'ఎవరి కోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు, గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టు వారోత్సవాలు మాకొద్దు' అనే నినాదంతో రెండు గిరిజన సంఘాల పేరుతో వాల్‌పోస్టర్లు వెలిశాయి. శనివారం ఉదయం వీటిని స్థానికులు ఆసక్తిగా చూశారు.


మోహిత్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జె. మోహిత్ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. పాడేరులో జరిగిన నియోజకవర్గ పోటీల్లో బాలుడు ప్రతిభ చూపాడని పీడీ కె. శివాజీ తెలిపారు. విద్యార్థి, పీఈటీ లక్ష్మణరావు, పీడీలను ప్రిన్సిపల్ టీవీఎం మోహన్ శనివారం అభినందించారు.

పరికరాలు ఉన్నా.. ప్రయోజనం సున్నా!

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ముంచంగిపుట్టులో రూ. కోట్ల ఖర్చుతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రూ. లక్షల ఖర్చుతో కొనుగోలు చేసి అమర్చిన వైద్య పరికరాలను ఏళ్లు గడుస్తున్నా వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు. శస్త్రచికిత్సల గదిలో పరికరాలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని కిలగాడ, లబ్బూరు, రూఢకోట, గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న 36 పంచాయతీలకు చెందిన సుమారు 80 వేల మంది జనాభాకు వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఆరేళ్ల కిందట ముంచంగిపుట్టులో సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల నుంచి పాడేరు జిల్లా ఆసుపత్రికి రోగులు పరుగులు తీయకుండా సీహెచ్‌సీలో చికిత్స అందించేందుకు సదుపాయలు సమకూర్చారు. ఎక్స్‌రే, స్కానింగ్, రక్త నిల్వ కేంద్రం, వ్యాధి నిర్ధారణకు ల్యాబ్ సదుపాయం కల్పించారు. శస్త్రచికిత్సల నిర్వహణకు పరికరాలు సమకూర్చారు. ఏళ్లు గడుస్తున్నా ఇవి వినియోగానికి నోచుకోవడం లేదు.


నిరుపయోగంగా శస్త్రచికిత్స పరికరాలు


సామగ్రి నిల్వ గదిగా ఉపయోగిస్తున్న శస్త్రచికిత్సల థియేటర్

వైద్యుల కొరతే కారణం

ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ. లక్షల ఖర్చుతో శస్త్రచికిత్సల పరికరాలను అమర్చిన వైద్యా విధానపరిషత్ అధికారులు వైద్యుల నియామకాన్ని విస్మరించారు. ఎనిమిది మంది వైద్యులు ఉండాల్సిన చోట దంత వైద్యుడితో సహా ముగ్గురు వైద్యులు మాత్రమే ఉండటంతో ఇక్కడ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందటం లేదు. శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణులు లేక పరికరాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు అవసరమైనవారు 54 కి.మీ.ల దూరంలోని పాడేరు జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.

పెరుగుతున్న రోగుల తాకిడి

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు సంయుక్తంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. ఆసుపత్రి ప్రసవాలతోపాటు వివిధ రకాల వ్యాధులకు వైద్యం పొందేందుకు ప్రతి రోజు 200 నుంచి 250 మంది వైద్యం కోసం వస్తున్నారు. శస్త్రచికిత్స అవసరమైనవారిని పాడేరు పంపిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యనిపుణులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎనిమిది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. ముగ్గురే ఉన్నారు. మరో ఐదుగురు అవసరం. వైద్య నిపుణులను నియమించాలని ఉన్నతాధికారులను కోరాం. పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు ప్రతిపాదనలు పంపించారు. వైద్య నిపుణులను నియమిస్తే వైద్య పరికరాలు ఉపయోగపడతాయి. అందుబాటులో ఉన్న వైద్యులు రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నారు.

– గీతాంజలి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ముంచంగిపుట్టు

దుకాణదారులకు నోటీసులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడలో జాతీయ రహదారికి ఆనుకుని దుకాణాలు నిర్మించున్నవారు మూడు రోజుల్లో వాటిని తొలగించాలని సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించి అధికారులు ఇప్పటికే సర్వే చేపట్టి హద్దులను గుర్తించారు. కొంత మంది హద్దులు దాటి నిర్మాణాలు చేపట్టడంతో సంబంధిత అధికారులు రెవెన్యూ యంత్రాంగానికి నివేదిక అందజేశారు. వాటిని తొలగించాలని నోటీసులిచ్చారు.

సీఆర్టీల సర్వీసు క్రమబద్ధీకరించరూ..

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సర్వీసు క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఆ సంఘం నాయకులు కోరారు. అమరావతిలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని వారు కలిసి, తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్. శైలజ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. ప్రభాకరరావు మాట్లాడుతూ.. లోతట్టు అటవీ ప్రాంతాల్లో చాలా ఏళ్లుగా సుమారు 1284 మంది కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నియమితులైన 470 మందిని రెగ్యులర్ చేశారని, తెదేపా ప్రభుత్వ హయాంలో నియమితులైన వారిని పట్టించుకోకుండా వదిలేశారని ముఖ్యమంత్రికి వివరించారు. చంద్రబాబునాయుడు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా కార్యదర్శులు జె. పుష్పలత, కె. సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

భగత్‌సింగ్‌కు నివాళి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ అడుగుజాడల్లో యువత నడవాలని చేయూత వారియర్స్ ట్రస్ట్ ఛైర్మన్ దూనబోయిన రమణ అన్నారు. శనివారం చింతపల్లిలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. రామరాజు, గిరి పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల్లో భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపల్స్ నాయక్, చలపతి, అధ్యాపక సిబ్బంది మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు విజయలక్ష్మి, సోంబాబు, లాలికుమారి, రోజారాణి, పాల్గొన్నారు.

ధరలు పెరుగుతున్నా నియంత్రించరా?

రంపచోడవరం, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు ఆకాశనంటుతున్నా.. వీటిని నియంత్రించడంలో అధికారయంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి. అనసూయ పేర్కొన్నారు. నిత్యావసర సరకులతోపాటు కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల- 2 పదో తరగతి విద్యార్థి ఆచూకీ లభ్యమైందని, బాలుడు క్షేమంగా ఉన్నట్లు వసతిగృహ సంక్షేమాధికారి గణేశ్వరరావు శనివారం తెలిపారు. ఆరోగ్యం బాగోలేదంటూ ఇంటికి వెళతానని ఉపాధ్యాయుల అనుమతితో వెళ్లిన విద్యార్థి అదృశ్యం అయ్యాడు. బాలుడి తండ్రి ఈనెల 16న చింతపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అదే పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న అప్పన్నకు డుంబ్రిగుడ మండలం కించుమండలో శనివారం బాలుడు క్షేమంగా కనిపించగా తల్లిదండ్రులకు అప్పగించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జి.మాడుగుల: వంతాల పంచాయతీ కేంద్రంలో సీసీ రోడ్డు పనులను సర్పంచి పద్మ శనివారం ప్రారంభించారు. గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 100 మీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ కల్యాణి, ఉప సర్పంచి తిరుపతమ్మ పాల్గొన్నారు.

30న తెదేపా శిక్షణ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరకులోయలో ఈనెల 30న జరిగే శిక్షణకు బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు హాజరు కావాలని తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు.

వైకాపాను దెబ్బతీసేందుకే లడ్డూ ప్రస్తావన

రంపచోడవరం, న్యూస్‌టుడే: వైకాపాని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉనికిని దెబ్బతీసేందుకే అధికారపార్టీ లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చిందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆరోపించారు. శనివారం ఐ.పోలవరంలో గోవిందగిరిపై వేంచేసిన వెంకటేశ్వరుని ఆలయం వద్ద పూజలు చేశారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టండి


కుందులూరులో లబ్ధిదారులతో గ్రామసభ

చింతపల్లి గ్రామీణం, సీలేరు, న్యూస్‌టుడే: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. శనివారం చింతపల్లి గ్రామ సచివాలయంలో లబ్ధిదారులతో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. స్లాబ్ పూర్తి చేసినవారు రెండో తేదీ లోపు పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తెదేపా నాయకులు రీమల ఆనంద్ పాల్గొన్నారు. సీలేరులో సర్పంచి పాంగి దుర్జో అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యదర్శి వి. శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యుడు పి. సాంబమూర్తి, ఉప సర్పంచి కె. వల్లీప్రసాద్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఉప ఎంపీపీ ఆనందరావు అన్నారు. కండ్రుం పంచాయతీలో సర్పంచి హరి, అరమ పంచాయతీలో గృహ నిర్మాణశాఖ మండల ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. అనంతగిరిలో సర్పంచి సోమెల రూతు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లుల బకాయిలను చెల్లించాలని కోరారు. ఉప తహసీల్దార్ మాణిక్యం, కార్యదర్శి బాలకృష్ణ, నాగులు, మోస్యా, జోగులు తదితరులు పాల్గొన్నారు.

★ టోకూరులో సర్పంచి కిల్లో మోస్యా మాట్లాడుతూ.. పాత ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉప సర్పంచి నర్సన్న, సారా దొన్ను, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ జి. వెంకటలక్ష్మి, తెదేపా, భాజపా మండలశాఖ అధ్యక్షులు జి. పెద్దిరాజు, టి. సూరిబాబు ఏఈ వెంకట్రాజు పాల్గొన్నారు.


చింతపల్లి సచివాలయంలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి


కండ్రుం గ్రామసభలో మాట్లాడుతున్న ఉప ఎంపీపీ ఆనందరావు

కూనవరం, వరరామచంద్రాపురం: గడువు లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ప్రసాదు కోరారు. పెదార్కూరు, రేగులపాడు, కూటూరు, కరకగూడెం గ్రామాల్లో ఆయన 'మన ఇల్లు, మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. కుందులూరు, పెద్దమట్టపల్లి, ములకలనపల్లి, దారపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో గృహనిర్మాణ సంస్థ మండల అధికారులు కాసీరాజ్, నాగరాజు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయనుందని ఏఈ సూరిబాబు తెలిపారు. జీకే వీధి, వంచుల, పెదవలస, దామనాపల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఇరువైపులా తుప్పలు.. రాకపోకలకు అవస్థలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి పుల్లంగి - గుడిస వెళ్లే రహదారిలో ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోయి, రహదారిని మూసేస్తుండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గుడిస ప్రముఖ పర్యటక కేంద్రంగా అభివృద్ధి చెందడంతో నిత్యం వేలాది మంది వాహనాలపై వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో మారేడుమిల్లి దాటిన దగ్గర నుంచి రహదారికి ఇరువైపులా తుప్పలు భారీగా పెరిగిపోయాయి. సింగిల్ లైన్ కావడం, తుప్పలు పెరిగిపోయి, రహదారిపైకి వచ్చేయడంతో మరింతగా సన్నగా మారిపోయింది. మలుపులు అధికంగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీ కొంటున్న సంఘటనలు అనేకం. పర్యటకుల్లో అత్యధికంగా యువత ఉండటం, వారంతా ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణిస్తుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలో భారీ వాహనాలు ప్రయాణిస్తే, ఎదురుగా వచ్చే వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా పోతుంది. చాలా సేపు నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు, గ్రామ పంచాయతీలు స్పందించి తుప్పలు తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.


గుడిస వెళ్లే దారిలో..

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని వినతి


మంత్రి దుర్గేష్‌ను కలిసిన నాయకులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మన్యంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరినట్లు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కాకి స్వామి తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం మంత్రిని స్వామితోపాటు చింతూరు జనసేన మండల అధ్యక్షుడు మడివి రాజు, రంపచోడవరం మండల ఉపాధ్యక్షుడు రాగాల సురేష్, సీనియర్ నాయకులు సీతయ్య, శివ కలిశారు. త్వరలోనే రంపచోడవరం ప్రాంతంలో పర్యటిస్తానని మంత్రి తెలిపారని నాయకులు చెప్పారు.

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం తగదు


ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బాబు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తూ అధికంగా నిధులు కేటాయిస్తున్న ఏజెన్సీ ప్రాంతంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సరిగా కల్పించడం లేదని రంపచోడవరం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ పి. బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఏపీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని వండి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్ల తదితర సదుపాయాలు సరిగా లేకపోవడాన్ని తెలుసుకుని వెంటనే సరిదిద్దాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.

నేడు గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు నిలిపివేత

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద ఉద్ధృతి కొనసాగుతుండటంతో ఆదివారం గండిపోశమ్మ అమ్మవారి ఆలయ దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఆలయాధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మైదాన ప్రాంతాల నుంచి భక్తులు ఎవరూ ఆలయానికి రావొద్దని సూచిస్తున్నారు. దండంగి- డి.రావిలంక మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు కొనసాగుతోంది. సీతపల్లి వాగుకు గోదావరి పోటెత్తడంతో సీతారం, దామనపల్లి పరిసర ప్రాంతాల్లో వాగులో నుంచి రాకపోకలు నిలిచాయి. పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యటక బోట్లు సైతం ఒడ్డుకు చేరాయి.

స్వర్ణాంధ్ర- 2047కు ప్రత్యేక ప్రణాళిక

చింతపల్లి, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర- 2047కు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. శనివారం రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. చింతపల్లి మండలంలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతోపాటు, అగ్రి, ఎకో టూరిజం ప్రాజెక్టులకు అనువైన మార్గాలు, వనరులు ప్రాంతాలవారీగా గుర్తించి నివేదిస్తామన్నారు. సినిమా చిత్రీకరణలకు ఇక్కడ అనువైన ప్రాంతాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎగుమతికి అనువైన పసుపు, పిప్పలి, అల్లం, యాలుకలు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యపంటలు, చిరుధాన్యాల సాగు జరుగుతోందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 గోడపత్రికను శనివారం కొయ్యూరులో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి టి. దొరబాబు, సర్పంచి బాలరాజు, భాజపా నేత చక్రరావు ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తెదేపా నేతలు మొట్టడం వీరయ్యదొర, వి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర - 2047 పథకంలో భాగంగా స్థానిక ఎమ్మార్సీ భవనంలో శనివారం మండల స్థాయిలో 'స్వర్ణాంధ్ర సాధించుటకు రాబోవు ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు వీటిని పరిశీలించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి ఆదివారం జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతితోపాటు ధ్రువపత్రాలు ఇస్తామన్నారు.


కొయ్యూరులో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నేతలు


వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

పర్యటక ప్రాంతాల్లో ప్రమాదాలకు తావివ్వొద్దు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రముఖ పర్యటక ప్రాంతాలు, జలపాతాల వద్ద అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగానికి ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరిగిన నేరాలు, కేసుల్లో పురోగతిపై చర్చించారు. సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై గ్రామాలు, విద్యాలయాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో ప్రతిరోజూ వాహనాల తనిఖీలు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గంజాయి కేసులను ఛేదించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతి అందించారు. ఏఎస్పీలు పంకజ్ కుమార్ మీనా, జగదీష్, సత్తిరాజ్, ఎస్.బి. సీఐ బి. అప్పలరాయుడు, డి.సి. ఆర్.బి సీఐ హెచ్ మల్లేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్, చిత్రంలో ఏఎస్పీలు పంకజ్‌కుమార్ మీనా, జగదీష్, సత్తిరాజు

సాయిబాబా జయంతి వేడుకలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో శనివారం నుంచి సాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కేక్ కోశారు. భజన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి


మారేడుమిల్లిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గర్భిణులు విధిగా పోషకాహారం తీసుకోవడంతోపాటు, ఆరోగ్య పరిరక్షణపైనా అవగాహన కలిగి ఉండాలని మారేడుమిల్లి ఎంపీపీ సార్ల లలితకుమారి సూచించారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పోషకాహార మేళా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, మారేడుమిల్లి సర్పంచి కొండా జాకబ్, ఉపసర్పంచి వీరబాబు, పరిపాలనాధికారిణి జయంతి, పీహెచ్‌సీ వైద్యురాలు రాణీశిరీష, సీడీపీవో ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా అన్నారు. టోకూరు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులు శుభ్రత పాటించాలని పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ.. పాఠశాలలో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. వైద్యులు ఎం హరి, జ్ఞానేశ్వరి, హెచ్ఎం స్వరూపారాణి, శైలజ, సర్పంచి మోస్యా పాల్గొన్నారు.


టోకూరులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

★ శివలింగపురం పాఠశాలలలో వైద్యారోగ్య సహాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 32 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు.

కూనవరం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఇతరుల వల్ల ఇబ్బంది కలుగుతుంటే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలని సామాజిక ఆరోగ్య అధికారిణి సుజాత చెప్పారు. శ్రీరాంపురం పాఠశాలలో పిల్లలతో ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్ఎం కన్నారావు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీహెచ్‌వో సుజాత

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: రంపచోడవరం నుంచి చినగెద్దాడ వెళ్లే రహదారిలో అడుగడుగున గుంతలు పడ్డాయి. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– హరికృష్ణ, చినగెద్దాడ గ్రామం

✔: ప్రధాన రహదారుల్లో పడిన గుంతలను పూడ్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలో గుంతలకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ రంపచోడవరం


గోతులను పూడ్చారు (స్పందనకు వందనం)



మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి శివారు సోమిరెడ్డి పాలెం వద్ద ఈ రహదారిపై పెద్ద గోతులు పడ్డాయి. దీనిపై 'ఈనాడు' 'మేమున్నాం...మీకుతోడుగా...!' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి ఈ గోతుల్లో బూడిదతో కలిపిన కంకరను పోశారు. బ్లేడు ట్రాక్టరుతో చదును చేసి, గోతులు పూడ్చారు. వాహనదారులకు ఇబ్బందులు కొంతమేర తొలగిపోయాయి.

అడ్డతీగల ఎస్సైగా వినోద్

అడ్డతీగల: అడ్డతీగల ఎస్సైగా బి. వినోద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తెదేపా నాయకులు బూర్లె హరిబాబు, యడ్ల శ్రీను, అక్కపల్లి పండు, భాజపా అరకు పార్లమెంటరీ కన్వీనర్ భారతి, మండల జనసేన పార్టీ నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి తదితరులు ఎస్సైని కలిశారు.


ఎస్సై వినోద్‌ను కలిసిన కూటమి నాయకులు

రహదారిపై కూలిన చెట్టు తొలగింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి, వై. రామవరం మండలాల్లోని లోతట్టు గ్రామాలకు వెళ్లే రహదారిపై కూలిన చెట్టును శనివారం తొలగించారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేటుకూరు పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామం వద్ద పెద్ద చెట్టు కూలిపోయింది. ఇది రహదారిపైనే పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో రోడ్లు, భవనాల శాఖ సిబ్బంది, స్థానికుల కలిసి కూలిన చెట్టును రంపాలతో కోసి, దుంగలను పక్కకు తొలగించారు. ఫలితంగా పీఎంకోట, ఇవ్వంపల్లి, భీమవరం గ్రామాలతోపాటు, వై. రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.


చెట్టును తొలగిస్తున్న స్థానికులు